క్లుప్తంగా

కేజీహెచ్‌లో మొక్కలు నాటిన రెడ్‌క్రాస్ సిబ్బంది



కేజీహెచ్ ఆవరణలో మొక్కలు నాటుతున్న రెడ్‌క్రాస్ సిబ్బంది

మహారాణిపేట : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ శివ నాగేంద్రరెడ్డి ఆదేశాల మేరకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకు కేజీహెచ్ ఆవరణలో రెడ్‌క్రాస్ సిబ్బంది మొక్కలు నాటారు. పర్యావరణ హితం కోరుతూ కేజీహెచ్ సిబ్బందితో కలిసి మొత్తం 350 మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, సీఎస్ ఆర్ఎంవో డాక్టర్ వాసుదేవ, ఏఆర్ఎంవోలు డాక్టర్ అరుణాదేవి, డాక్టర్ జగదీష్, రెడ్‌క్రాస్ సెక్రటరీ రవికుమార్, మేనేజర్ మురళీ, మెడికల్ ఆఫీసర్ లక్ష్మీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ లింక్ చేయమనటం తగదు

డాబాగార్డెన్స్ : విద్యుత్ మీటర్లకు ఆధార్ లింక్ చేయాలని ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులపై తీవ్ర ఒత్తిడి చేస్తోందని, ఈ చట్ట వ్యతిరేక చర్యను వ్యతిరేకిస్తున్నట్లు సీపీఎం నగర కార్యదర్శి ఎం. జగ్గునాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా ప్రతి ఇంటికి విద్యుత్ ఉద్యోగులు వెళ్లి ఆధార్ నంబర్లు ఇవ్వమని ఒత్తిడి చేస్తున్నారని, ఆధార్ నంబరు ఇవ్వకపోతే విద్యుత్ కనెక్షన్ తొలగిస్తామని భయపెడుతున్నారని చెప్పారు. ఓటరు కార్డుకి ఆధార్ లింక్ చేయమని కేంద్ర ప్రభుత్వం చెప్పినప్పుడు సుప్రీంకోర్టు ఈ చర్యను తిరస్కరించిందన్నారు. ఇప్పుడు విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ లింక్ ముడిపెట్టి ప్రజలను బెదిరిస్తున్నారని తెలిపారు. ఆస్తిపన్ను, స్కీములకు కూడా ఆధార్ లింక్ పెట్టారని, స్కీంలు కుదించడానికే ప్రభుత్వాలు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నాయని అన్నారు.

రంగస్థల విభాగ విద్యార్థినికి అభినందన



సాయిప్రియను సత్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రంగస్థల విభాగం విద్యార్థిని ఎం.సాయిప్రియను వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. నాటకం, నృత్యం, వ్యాఖ్యానం, ఆహార్యం తదితర రంగాలలో సాయిప్రియ చూపుతున్న ప్రతిభకు ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం లభించింది. ఈ సందర్భంగా వీసీ తన కార్యాలయంలో ఆమెను అభినందించి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, విభాగ అధ్యాపకులు డాక్టర్ ఎం.భాస్కరరావు, డాక్టర్ ఎం.శశిభూషణరావు, రఘురాం, సత్యనారాయణ, శ్రీనివాసరావు, దుర్గారావు, అర్హతుల్లా, సూర్యకళ, అనూరాధ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చైర్ ఆధ్వర్యంలో ఆయుష్మాన్ హార్ట్ సెంటర్ సహకారంతో నిర్వహించిన ఉచిత గుండె పరీక్ష వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఏయూ ఆచార్యులు, బోధనేతర సిబ్బంది పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ హృద్రోగ నిపుణుడు డాక్టర్ గరికపాటి మహేష్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ఏయూ ఉద్యోగులకు రక్త పరీక్షలు, ఈసీజీ, ఏకో, బీపీ పరీక్షలు చేశారు. రిపోర్టుల ఆధారంగా ఉద్యోగులకు అవసరమైన చికిత్స విధానాలు, సూచనలు తెలియజేశారు.

ఉత్తరం.. ఓ జ్ఞాపకం

గతంలో ఉత్తర ప్రత్యుత్తరాల ద్వారా ఒకరికొకరికి సంభాషణ జరిగేది. దసరా, సంక్రాంతి, దీపావళి పండగలకు వస్తున్న సంగతి నుంచి.. అన్ని సంఘటనల పైనా లను జాబుల్లో నిక్షిప్తం చేసేవారు. తమకు వచ్చే జాబులను ఆసక్తిగా చదువుకునే వారు. వచ్చిన జాబులన్నింటినీ భద్రంగా దాచుకునేవారు. గుర్తుకు వచ్చినప్పుడు తీసి చదువుకుని జ్ఞాపకాలను నెమరువేసుకునేవారు.

- ఆధునికత పరుగులో తెరమరుగు
- లేఖల ఊసే లేక తపాలా పెట్టెలు వెలవెల
- స్మార్ట్ ఫోన్‌తో వెనుకటి వైభవానికి చెల్లుచీటీ



వెలంపేటలో గల హెడ్‌పోస్టాఫీస్

డాబాగార్డెన్స్: సాంకేతిక విప్లవం జోరందుకున్న కొద్దీ నేటితరం ఉత్తరాలంటే తెలియని స్థితిలో ఉంది. స్మార్ట్‌ఫోన్ హోరులో లేఖ మనుగడకు ముప్పు ఎదురవుతోంది. విద్యార్థులు లేఖలు రాసేలా పాఠశాల స్థాయిలో ప్రోత్సహించకపోగా.. తర్వాత కూడా వీటి అవసరం లేదన్న వాతావరణం కనిపిస్తోంది. 24 గంటలూ స్మార్ట్‌ఫోన్లతో అరకొర సందేశాలు పంపడంలోనే ఆనందాన్ని వెతుక్కుంటున్న యువత లేఖ ప్రాధాన్యతను, అందులో ఆనందాన్ని తెలుసుకోలేకపోతోంది.

ఇప్పటి తరం..ఇలా..(స్మార్ట్‌రంగం)

మారుతున్న రోజులకు అనుగుణంగా..సాంకేతిక రంగం విరాజిల్లుతున్న ఈ రోజుల్లో.. పాత జ్ఞాపకాల సంగతి పక్కన పెడితే.. సాంకేతికత పెరుగుతున్న తరుణంలో ఎటువంటి సమాచారమైనా క్షణాల్లో చేరుతుందనేది కొందరి వాదన. అప్పటి రోజుల్లో ఉత్తరాన్ని పోస్ట్ చేస్తే నాలుగైదు రోజుల తర్వాత చేరేది. కానీ ప్రస్తుతం క్షణాల్లోనే సమాచారం వచ్చేస్తోందని పలువురు చెబుతున్నారు.

సాంకేతికతతో పెరిగిన నేరాలు..



సాంకేతికత అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో అందుకు తగ్గట్టు నేరాలు.. ఘోరాలు అదే రీతిన జరుగుతున్నాయి. ముఖ్యంగా యువతీ, యువకులు చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారు. అలాగే స్మార్ట్‌ఫోన్‌తో విద్యార్థుల చదువుకు సంబంధించి అన్ని విషయాలు లభిస్తున్నాయి. గతంలో పుస్తకాలు లభించక చెప్పులరిగేలా తిరిగే వారు. ఇప్పుడు ఆ దుస్థితి లేదు. సాంకేతికత అభివృద్ధి చెందడంతో గతంలోలా బ్యాంకులకు వెళ్లాల్సిన పని లేకుండా పోయింది. దాచుకున్న డబ్బు తీసుకోవాలంటే బ్యాంకుల వద్ద పడిగాపులు కాయాల్సి వచ్చేది.

– చిటికిరెడ్డి పవన్‌కుమార్, యజమాని, మెడికల్ షాపు

అదో తీపి గుర్తు..



మనలోని భావాల్ని ఎదుటి వారికి నేరుగా చెప్పలేని విషయాలను.. ఉత్తరాల ద్వారా చక్కగా వివరించవచ్చు. ఉత్తరం ఓ మధుర జ్ఞాపకం. మన తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు..ఇలా ఎవరికి లేఖ రాసినా అదొక తీపి గుర్తు. లేఖలు భాషపై పట్టు పెంచుతాయి. ఈ విషయాన్ని నేటితరం యువత గుర్తించాలి. మళ్లీ ఉత్తరాలు రాసే సంస్కృతిని తీసుకు రావాలి.

– ధూళి రమేష్, వ్యాపారవేత్త

గొప్ప సంస్కృతి..

లేఖలు రాయడం గొప్ప సంస్కృతి. నెహ్రూ జైల్లో ఉన్నప్పుడు ఇందిరాగాంధీకి ఉత్తరాలు రాశారు. అది ఆమెను ఎంతో ప్రేరేపించింది. మనం చెప్పాలనుకున్న విషయాలను, ఆలోచనలు, భావాలను ఫోన్ల ద్వారా చెప్పడం కంటే ఉత్తరాల్లో చక్కగా రాసి పంపవచ్చు. నేను చిన్నప్పటి నుంచి కళాశాలల్లో చదివే వరకు లేఖలు రాసి, స్నేహితులు, బంధువుల క్షేమ సమాచారాలను తెలుసుకునేవాడిని. ఇప్పటికీ వాటిని దాచుకున్నాను.

– గొంప గోవిందరాజు, కాంగ్రెస్ నగర అధ్యక్షుడు

అదో అద్భుతం..



తల్లిదండ్రులతో కష్టసుఖాలు, అనుభవాలను పంచుకునే తీపి గుర్తు. విశాఖ సాగరతీరంలో ఇసుక తిన్నెలపై కూర్చుని నా స్నేహితులకు ఎన్నో ఉత్తరాలు రాసేవాడిని. ప్రస్తుతం టెక్నాలజీ పెరిగే కొద్దీ కలం, కాగితాన్ని పక్కన పెట్టి స్మార్ట్‌ఫోన్లకు పని చెబుతున్నారు. ప్రతి చిన్న విషయానికి వాట్సాప్.. ఫేస్‌బుక్, సెల్‌ఫోన్ మెసెజ్‌ల ద్వారా చేరవేస్తున్నారు.

– పి.రామలింగేశ్వరరావు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి

బాల్యం నుంచి అలవాటు..



చిన్నప్పటి నుంచి స్నేహితులు, బంధువులకు ఉత్తరాలు రాస్తూ ఉండేవాడిని. దసరా, సంక్రాంతి, దీపావళి సెలవులు వచ్చాయంటే చాలు.. ఉత్తరాల ద్వారానే సంభాషణలు సాగేవి. అందుకే ఉత్తరాలు రాయడం అంటే నాకు చాలా ఇష్టం. నా స్నేహితులు పంపిన ఉత్తరాలు నేటికీ పదిలంగా దాచుకున్నాను.

–చందక ప్రభాకర్, ఉద్యోగి

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

ప్రతి ఇంటా పరీక్షలు చేయనున్న వైద్య సిబ్బంది



డాబాగార్డెన్స్ : ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యానికి అనుగుణంగా అక్టోబర్ ఒకటి నుంచి 45 రోజుల పాటు వైద్య శిబిరాలు నిర్వహించడానికి సర్వే ప్రక్రియ శరవేగంగా కొనసాగుతోంది. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు పక్కాగా నిర్వహించేందుకు జోన్-4 పరిధిలోని విశాఖ దక్షిణ, తూర్పు నియోజకవర్గాల్లోని యూపీహెచ్‌సీలను సిద్ధం చేశారు. ఆయా యూపీహెచ్‌సీల పరిధిలో సచివాలయాల ఏఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, వలంటీర్లు ఈ నెల 27 నుంచి ఇంటింటికీ వెళ్లి ప్రతి వ్యక్తి ఆరోగ్యంపై సర్వే నిర్వహించనున్నారు.

యూపీహెచ్‌సీలు ఇవే..

నియోజకవర్గ పరిధిలోని దొండపర్తి సచివాలయ పరిధి యూపీహెచ్‌సీలో భగత్‌సింగ్‌నగర్, దొండపర్తి-1, దొండపర్తి-2, హిందూ ముస్లింకాలనీ, ఐఎస్‌బీ నగర్, జబ్బరతోట యూపీహెచ్‌సీ పరిధిలో శ్రీరంగపురం, వేంకటేశ్వరనగర్, దండుబజార్-1, దండుబజార్-2, దండుబజార్-3, తాడివీధి, కోడిపంద్యాలవీధి, నేవల్‌క్యాంటీన్, రెల్లివీధిలో, రంగిరీజువీధి యూపీహెచ్‌సీ పరిధిలో గల జాలారిపేట-4, అఫీషియల్‌కాలనీ-1, పెయిన్‌దొరపేట-1, పెయిన్‌దొరపేట-2, పెయిన్‌దొరపేట-3, గొల్లవీధి-1, 2, రంగిరీజువీధి, గొడారిగోతులు, బురుజుపేట, వేంకటేశ్వరనగర్-2, మట్టావెంకటప్పయ్య వీధి, చిన్నమ్మవారి స్ట్రీట్, మౌలాలీపంజా యూపీహెచ్‌సీ పరిధిలోని చెంగ్రలావుపేట, వెలంపేట-1, మౌలాలీపంజా, అంబుసరంగ్‌కాలనీ, చిలకపేట-1, థామ్సన్‌స్ట్రీట్‌లోనూ, ప్రసాద్‌గార్డెన్స్ యూపీహెచ్‌సీ పరిధిలోని వెలంపేట-3, టౌన్‌కొత్తరోడ్డు, వెలంపేట-4, వుడ్‌యార్డ్‌స్ట్రీట్, మున్సిపల్ స్టేడియం, వెలంపేట-5, ప్రసాద్‌గార్డెన్స్‌లోనూ, భీంనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో గల గొల్లలపాలెం-1, ఎస్‌బీఐ కాలనీ, వుడ్‌యార్డ్‌స్ట్రీట్, భీంనగర్, డ్వాక్రాబజార్, టీఎస్సార్ కాంప్లెక్స్, పద్మానగర్, చిలకపేట-2లోనూ, కొబ్బరితోట యూపీహెచ్‌సీ పరిధిలో గల కుమ్మరవీధి, గౌరీస్ట్రీట్, వేంకటేశ్వరమెట్ట-1, 2, బంగారమ్మ మెట్ట, కొబ్బరితోట-1, కొబ్బరితోట-2, యాతపేట, భూపేష్ నగర్, అచ్చియ్యమ్మపేట, నేరేళ్లకోనేరు, అల్లిపురం-1,2, భానోజీనగర్ యూపీహెచ్‌సీ పరిధిలో గల జీవీఎంసీ కార్యాలయ పరిధిలో సర్వే నిర్వహించి రక్తపోటు (బీపీ), షుగర్ పరీక్షలు చేస్తారు. రక్తహీనతతో బాధపడేవారు, పౌష్టికాహార లోపంతో బాధపడేవారిని ఈ సర్వేలో గుర్తిస్తారు. జోన్ పరిధిలో గల అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో బరువు తక్కువ, రక్తహీనత, ఎదుగుదల లోపం గల పిల్లలను గుర్తించి మందులు అందజేస్తారు.

దీర్ఘకాలిక వ్యాధులకు స్పెషలిస్టులతో వైద్యం..

దీర్ఘకాలిక వ్యాధులైన క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ సమస్యలు వంటివి గుర్తిస్తారు. వారిని ఆయా యూపీహెచ్‌సీ పరిధిలో నిర్వహించే వైద్య శిబిరాలకు తరలించి స్పెషలిస్ట్ వైద్యుల పర్యవేక్షణలో చికిత్స అందిస్తారు. అవసరమైతే ఉన్నత వైద్యశాలకు తరలించేందుకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రూపకల్పన చేశారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా అవసరమయ్యే వైద్య ఖర్చు ప్రభుత్వమే భరిస్తుంది. సర్వేకు వస్తున్న సిబ్బందికి ప్రజలు సహకరించి అనారోగ్య సమస్యలు తెలియజేయాలని అధికారులు కోరుతున్నారు.

అన్నదానాలు.. దీపారాధనలు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కొల్లి సింహాచలం



దొండపర్తి కుప్పిలివారివీధి గణపతి మండపం వద్ద దీపారాధన దృశ్యం

డాబాగార్డెన్స్ : వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా జీవీఎంసీ 39వ వార్డు పద్మానగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద మంగళవారం పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని కనకమహాలక్ష్మి దేవస్థానం చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం ప్రారంభించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు బాబ్జి, సోమేశ్, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి కుప్పిలివారివీధిలో ఏర్పాటు చేసిన యూత్‌స్టార్ అసోసియేషన్ గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. మంగళవారం పార్వతీ తనయుని సన్నిధిలో మండపం వద్ద మహిళలు భారీ ఎత్తున దీపారాధన నిర్వహించారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



పవిత్రోత్సవాల్లో అమ్మవారికి విశేష పూజలు



ప్రత్యేక పూజలో సిరులతల్లి



పవిత్రోత్సవాలు తీసుకు వస్తున్న ధర్మకర్తల మండలి సభ్యులు, వేదపండితులు

డాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అదే విధంగా కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈనెల 28న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఆలయ ఈవో కె. శిరీష తెలిపారు.

3వ రోజుకి పవిత్రోత్సవాలు..

కనకమహాలక్ష్మికి నిర్వహిస్తున్న పవిత్రోత్సవాలు మంగళవారం 3వ రోజుకి చేరాయి. ఉదయం 8 నుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచన, పవిత్ర-అభిమంత్రణం, అమ్మవారికి అభిషేకం, అష్టకలశస్నపన, పవిత్రారోహణ, నీరాజనం, మంత్రపుష్పం నిర్వహించారు. సాయంత్రం 6 నుంచి విశేష హోమాలు జరిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా బుధవారం విష్వక్సేన ఆరాధన, పవిత్ర అవరోహణ, పూర్ణాహుతి, ఆశీర్వచనం నిర్వహించనున్నట్టు ఈవో శిరీష తెలిపారు. ఉదయం 11 గంటలకు పంచామృతాభిషేకం నిర్వహించిన అనంతరం అంతరాలయ దర్శనం కల్పించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు సత్యరూపవాణి, వెంకటరత్నం, సతీష్, సుబ్రహ్మణ్యం, సురేష్, కార్యనిర్వాహక ఇంజనీర్ సీహెచ్‌వీ రమణ, సహాయ కార్యనిర్వహణాధికారి కె. రాజేంద్రకుమార్, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, వేదపండితులు, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్లలోకి వచ్చిన కొండచిలువ

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డు బుచ్చిరాజుపాలెం ఎస్ఎస్‌టీఎల్ వెనుక గోడ సమీపం నుంచి ఇళ్లల్లోకి మంగళవారం కొండచిలువ రావటంతో ఆ ప్రాంత వాసులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. ఇంటి కాంపౌండ్ వాల్‌లోకి వచ్చి బాత్ రూమ్‌కు సమీపంలోని పొదల్లో దూరటంతో విషయాన్ని స్నేక్ స్నేచర్ కిరణ్‌కు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. దీంతో కిరణ్ అక్కడకు చేరుకొని సుమారు 8 అడుగుల కొండచిలువను పట్టుకొని తీసుకెళ్లారు. దీంతో అక్కడి వాసులంతా ఊపిరిపీల్చుకున్నారు.

నాయకత్వం, నైపుణ్యాలపై అవగాహన



అజిత్‌కుమార్‌ని సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ ఎస్.కె.భట్టి తదితరులు

ఏయూ క్యాంపస్: నాయకత్వ లక్షణాలు వ్యక్తి ప్రగతిని, వ్యవస్థ వికాసాన్ని ప్రభావితం చేస్తాయని వీడీఎం ఇండియా ఆన్ దమూవ్ స్వచ్ఛంద సంస్థ చైర్మన్ ఆచార్య అజిత్‌కుమార్ అన్నారు. మంగళవారం ఆయన ఏయూ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో నాయకత్వ నైపుణ్యాలు అనే అంశంపై మాట్లాడారు. సమూహంగా పని చేయడం, సమష్టిగా విజయం సాధించడం, నాయకత్వం వహించడం వంటి విభిన్న అంశాలను విద్యార్థులకు వివరించారు. వ్యక్తిగా ప్రస్థానాన్ని ప్రారంభించి, వ్యవస్థను ప్రభావితం చేసే వ్యక్తులుగా ఎదగాలన్నారు. నాయకత్వంలో విధానాలు, పెంపొందించే అంశాలు, ప్రాధాన్యతలను తెలియజేశారు. అనంతరం విద్యార్థుల సందేహాలకు సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్.కె.భట్టి, విభాగాధిపతి ప్రజ్ఞ, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బహుభాషా అంతర్జాతీయ సదస్సు



బహు భాషా ముగింపు వేడుకల్లో పాల్గొన్న అతిథులు, విద్యార్థినులు

కంచరపాలెం : జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాలలో హిందీ సాహిత్య భారతి సౌజన్యంతో కన్వీనర్, ద్వితీయ భాషా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ పీకే జయలక్ష్మి నేతృత్వంలో భారతీయ సాహిత్యం, ఆధ్యాత్మికత అనే అంశంపై జరిగిన రెండు రోజుల అంతర్జాతీయ బహుభాషా సదస్సు మంగళవారం ముగిసింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉన్నత విద్య రీజినల్ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్. శోభారాణి పాల్గొని మాట్లాడారు. ఆధ్యాత్మిక తత్వాన్ని నేటి యువతకు అందించాల్సి బాధ్యత అధ్యాపకులపై ఉందన్నారు. ఇలాంటి బహుభాషా సదస్సులు అధ్యాపకులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, పరిశోధకులు, ఆధ్యాత్మిక వేత్తలకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. తెలుగు, హిందీ, సంస్కృత సాహిత్యాలు, ఇతిహాసాలు, పురాణాల్లో ప్రవచించిన ఆధ్యాత్మిక తత్వాన్ని వివరించే పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ షైజీ, సాహితీ వాచస్పతి డాక్టర్ డీవీ సూర్యారావు, డాక్టర్ సుమన్‌లత, డాక్టర్ నళినిదత్త, డాక్టర్ సుధ, డాక్టర్ కృష్ణబాబు, నిర్మల, డీకే రాజు, డాక్టర్ దీప్తి, ప్రమీల, వీణ, గౌరీనాయుడు, తెలుగు, హిందీ, సంస్కృతం, ఫ్రెంచ్, ఆంగ్ల అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ సమావేశాలు ప్రారంభం



సమావేశాలకు హాజరైన యూనియన్ ప్రతినిధులు, నాయకులు



సమావేశాలు ప్రారంభిస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్ శర్మ

తాటిచెట్లపాలెం: ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ 10వ ద్వి-వార్షిక సర్వసభ్య సమావేశాలు మంగళవారం తాటిచెట్లపాలెంలోని ఆశీర్వాద్ కల్యాణ మండపంలో ప్రారంభమయ్యాయి. ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ మనోజ్‌శర్మ జ్యోతి ప్రజ్వలన చేసి ఈ సమావేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్ఎఫ్ఐఆర్(నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్) జనరల్ సెక్రటరీ డాక్టర్ మర్రి రాఘవయ్య రన్నింగ్ స్టాఫ్, ట్రాక్ మెయింటెనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలపై మాట్లాడారు. వీరిని సూపర్‌వైజర్ కేటగిరీకి అప్‌గ్రేడ్ చేయాలని కోరారు. ఎన్ఎఫ్ఐఆర్ గుర్తింపు పొందిన యూనియన్ల పోరాటంతో త్వరలోనే ఎన్‌పీఎస్ రద్దవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. మరో జనరల్ సెక్రటరీ ఆర్‌సీ సాహూ మాట్లాడుతూ ఈస్ట్‌కోస్ట్ రైల్వే పరిధిలో ఖాళీ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కే కే, కే-ఆర్ లైన్‌లో ఆరోగ్య సమస్యలతో ఉన్న ఉద్యోగులు, సిబ్బందికి ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ అన్ని వేళలా అండగా ఉంటుందన్నారు. కింది స్థాయిలో పని చేస్తున్న ఉద్యోగులకు వర్క్ టు రూల్ అమలు చేయాలని, సిబ్బందికి పనిభారం తగ్గేలా చూడాలని కోరారు. ఈస్ట్‌కోస్ట్ రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ పర్సనల్ ఆఫీసర్ సిద్ధార్థ్ కటి, వాల్తేర్ డీఆర్ఎం సౌరభ్ ప్రసాద్, ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ జె.సంపత్ కుమార్, డివిజనల్ కో-ఆర్డినేటర్ టి.వి.మౌళీశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎంఎస్ సుబ్బలక్ష్మి ప్రచార్య పురస్కార గ్రహీతకు సత్కారం



సరస్వతి విద్యార్థిని సత్కరిస్తున్న రెక్టార్ ఆచార్య కె.సమత, ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు

ఏయూ క్యాంపస్: డాక్టర్ ఎంఎస్ సుబ్బులక్ష్మి ప్రచార్య పురస్కారం అందుకున్న ఏయూ సంగీత విభాగం ఆచార్యులు సరస్వతి విద్యార్థిని మంగళవారం ఉదయం విభాగంలో ఘనంగా సత్కరించారు. ఇటీవల శ్రీ షణ్ముఖానంద సభ నుంచి ఆమె ఈ పురస్కారం స్వీకరించిన సందర్భంగా విభాగ ఆచార్యులు, విద్యార్థులు ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రెక్టార్ ఆచార్య కె.సమత మాట్లాడుతూ ప్రతిష్టాత్మకమైన ఈ అవార్డును అందుకున్న తొలి తెలుగు వ్యక్తి ఆచార్య సరస్వతి విద్యార్థి కావడం వర్సిటీకి గర్వకారణమన్నారు. ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు మాట్లాడుతూ భారతీయ సంగీతం, సాహిత్యం ఎంతో విశిష్టమైనవన్నారు. ఏయూ సంగీత విభాగం దశాబ్దాలుగా ఎందరో గాయకులను తీర్చిదిద్ది సమాజానికి అందించిందన్నారు. ఈ కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య అనూరాధ, విభాగ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొండవాలులో ఫాగింగ్

కంచరపాలెం: జీవీఎంసీ 48వ వార్డు కంచరపాలెం పరిధి ఇందిరానగర్ – 1, జవహర్‌లాల్ నెహ్రూ నగర్, జై భారత్ నగర్, శ్రీనివాసనగర్ కొండవాలు ప్రాంతాల్లో కార్పొరేటర్ గంకల కవిత ఆదేశాల మేరకు మలేరియా నివారణ విభాగం సిబ్బంది మంగళవారం ఫాగింగ్ చేపట్టారు. ఇటీవల వార్డు పర్యటనలో విషజ్వరాలపై స్థానికులు వినతిపత్రాలు ఇవ్వడంతో సంబంధిత అధికారులతో కార్పొరేటర్ కవిత మాట్లాడి దోమల నియంత్రణకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు గంకల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 8 మందికి జైలు శిక్ష



సౌత్ జైలురోడ్డులో డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తున్న టూటౌన్ ట్రాఫిక్ ఎస్ఐ లక్ష్మి

దొండపర్తి/అల్లిపురం : మద్యం తాగి వాహనాలు నడిపిన పలువురికి కోర్టు జైలు శిక్ష, జరిమానా విధించింది. న్యూపోర్టు, హార్బర్, మల్కాపురం స్టేషన్ల పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపిన 55 మందిని ఒకటో స్పెషల్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరచగా ఎనిమిది మందికి జైలు శిక్ష విధించారు. అందులో బొలెరో వాహనం డ్రైవర్‌కు 10 రోజులు జైలు శిక్ష విధించారు. మిగిలిన వారికి మొత్తంగా రూ.1.78 లక్షలు జరిమానా వేశారు. ఆరిలోవ పరిధిలో 16 మందికి రూ.30,500, పీఎం పాలెం పరిధిలో 14 మందికి రూ.49 వేలు, గోపాలపట్నం స్టేషన్ పరిదిలో 10 మందికి రూ.26 వేలు, పెందుర్తిలో 20 మందికి రూ.47,500 జరిమానా విధించారు. అలాగే కంచరపాలెం స్టేషన్ పరిధిలో 20 మందికి రూ.1.04 లక్షల జరిమానా విధించడంతో పాటు వారిలో ఏడుగురికి వారం రోజులు జైలు శిక్ష విధించారు. గాజువాక పరిధిలో 15 మందికి రూ.38 వేలు, టూ టౌన్ స్టేషన్ పరిధిలో 15 మందికి రూ.1.19 లక్షలు జరిమానా వేశారు.

మానవతా విలువలు అవసరం



రవీంద్ర శుక్లాను సత్కరిస్తున్న విభాగ ఆచార్యులు, విద్యార్థులు

ఏయూ క్యాంపస్: మానవతా విలువలు యువత కలిగి ఉండాల్సిన అవసరం ఉందని ఉత్తరప్రదేశ్ రాష్ట్ర పూర్వ విద్యాశాఖ మంత్రి డాక్టర రవీంద్ర శుక్లా అన్నారు. మంగళవారం ఆయన ఏయూ హిందీ విభాగాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువలను విద్యా వ్యవస్థలో అంతర్భాగం చేయాలన్నారు. విద్యాశాఖ మంత్రిగా తాను పనిచేసిన సమయంలో తీసుకువచ్చిన మార్పులను వివరించారు. భారతదేశ ఔన్నత్యాన్ని నిలుపుతూ యువతకు మెరుగైన భవిష్యత్తును అందించేలా పాలకులు పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం డాక్టర్ రవీంద్ర శుక్లాను హిందీ విభాగ ఆచార్యులు నల్ల సత్యనారాయణ, ఆచార్యులు, పరిశోధకులు, తదితరులు ఘనంగా సత్కరించారు.